క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన



లబ్ధిదారుతో మాట్లాడుతున్న అధికారులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో చేపట్టిన ఐదు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం అధికారులు పరిశీలించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన 20 ఇళ్లను సైతం పరిశీలించారు. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో వనజ, ఆర్‌ఐ రాజేశ్వర్, కార్యదర్శి సారిక తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టీషర్టులు అందజేత



టీషర్టులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో నరేందర్, యూత్ సభ్యులు

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామ ప్రాథమిక పాఠశాలలో 93 మంది విద్యార్థులకు జైశ్రీరామ్ యూత్ సమకూర్చిన టీషర్టులను గురువారం ఎంఈవో నరేందర్ అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు జైశ్రీరామ్ యూత్ టీషర్టులు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. హెచ్‌ఎం సుధాకర్, యూత్ సభ్యులు గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

‘ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు’



మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు శ్రీనివాస్

కడెం: భారత ప్రధాని మోదీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్‌పై ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఇందులో నాయకులు కిష్టయ్య, మోహన్‌నాయక్, సత్తెన్న, కృష్ణ, రాపర్తి శ్రీనివాస్, తిరుమల్, శ్రీరాం తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన



కుంటాల: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు భారతదేశపటం ఆకృతిలో కూర్చున్న ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఈవోగా విజయ్

కుభీర్: మేజర్ గ్రామపంచాయతీ అయిన కుభీర్ ఈవోగా అంతర్ని పంచాయతీ కార్యదర్శి విజయ్ ఇన్‌చార్జి ఈవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సాగర్ రెడ్డి, ఎంపీవో మోహన్‌సింగ్ ఉన్నారు.

15 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని రామచంద్ర మిషన్ కాన్హా శాంతివనంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు షెట్‌పెల్లి అరుణ్‌శర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న జరిగే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘ చలాక్ డాక్టర్ మోహన్ భగవత్, 17న జరిగే కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణుడి ప్రాముఖ్యత, విశిష్టతను భక్తులకు వివరిస్తారని.. జిల్లా నుంచి కృష్ణుడి భక్తులు తరలి రావాలని కోరారు.

వేడుకలకు ముస్తాబు



పేర్కపల్లెలో ముస్తాబు చేస్తున్న విద్యార్థులు

దస్తురాబాద్: స్వాతంత్ర్య వేడుకలకు పాఠశాలలు, మండలంలోని కార్యాలయాలను గురువారం ముస్తాబు చేశారు. విద్యార్థులు తిరంగా జెండాలు, తోరణాలతో తరగతి గదులను సుందరంగా అలంకరించారు.

కూరగాయల సాగుతో సిరులు

- ఆధునిక పద్ధతులు పాటిస్తున్న వైనం
- రైతులకు ఆదర్శంగా శ్రీనివాస్

కుంటాల: మూస పద్ధతిలో పంటలు పండించే విధానానికి స్వస్తి పలికి.. ప్రణాళికాబద్ధంగా ఏడాది పొడవునా కూరగాయలు సాగు చేస్తున్నాడు. ఒక పంటనే నమ్ముకోకుండా వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నాడు. వ్యవసాయాధికారుల సూచనలతో తీరొక్క కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాడు జిల్లాలోని కుంటాల మండలకేంద్రానికి చెందిన దోనిగామ శ్రీనివాస్ అనే రైతు. సస్యరక్షణ చర్యలు చేపట్టి లాభాలు పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



చేనులో బబ్బెర, బెండ, బీర తోటలు

ఐదు ఎకరాల్లో 10 రకాలు..

మండల కేంద్రం కుంటాలకు చెందిన దోనిగామ శ్రీనివాస్ తనకున్న 5 ఎకరాల్లో 20 గుంటల్లో వరి సాగు చేస్తూ.. మిగిలిన నాలుగున్నర ఎకరాల్లో కూరగాయలను పండిస్తున్నాడు. ఇందులో టమాటా, వంకాయ, చిక్కుడు, బీర, బెండ, కాకర, బబ్బెర, పువ్వుగోబీ, ఆకు గోబీ, పాలకూర, పచ్చిమిర్చి పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, డ్రాగన్‌ఫ్రూట్ పంటలను సాగు చేస్తున్నారు. కొన్ని పంటలను పందిరి సాగు విధానంలో పండిస్తున్నాడు. మార్కెట్‌లో ఒక పంటకు ధర లేకపోయినా మరో పంటకు ధర కలిసి వస్తోందని చెప్పుకొచ్చాడు.

భగీరథ ప్రయత్నం..

పత్తి, సోయా, జొన్న, మొక్కజొన్న పంటల సాగు కోసం ఈ రైతు సుమారు 30 వరకు బోరు బావులను వేయించినప్పటికీ నీరు రాలేదు. తన భగీరథ ప్రయత్నాన్ని ఆపకుండా మళ్లీ రెండు బోరు బావులు తవ్వించాడు. వాణిజ్య పంటలకు నీటి తడులు ఎక్కువ అవసరం అవుతాయని.. ఏక పంట విధానానికి స్వస్తి పలికాడు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు వచ్చే కూరగాయల పంటల సాగుకు శ్రీకారం చుట్టాడు. డ్రిప్ సిస్టం(బిందు సేద్యం) ద్వారా నీటి తడులు, ఎరువులకు పంటలు అందిస్తున్నారు. ఇప్పటికప్పుడు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.



సాగు చేసిన కాకర



సాగవుతున్న టమాటా

ఏటా రూ.ఐదున్నర లక్షల ఆదాయం..

పెట్టుబడులు పోనూ ఏటా రూ.ఐదున్నర లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకు ఆదాయం గడిస్తున్నట్లు రైతు పేర్కొన్నాడు.

మార్కెట్, సంతల్లో విక్రయం..

తాను పండించిన కూరగాయలను మార్కెట్‌లో, గ్రామాల్లో వారసంతల్లో విక్రయిస్తున్నాడు. తాజా కూరగాయలను అమ్ముతుండటంతో వినియోగదారుల నుంచి కూడా మంచి స్పందన వస్తుందని పేర్కొంటున్నాడు. కుటుంబసభ్యుల సహకారంతోనే ఆదాయం గడిస్తున్నట్లు వివరించాడు. దీంతోపాటు పలువురు కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించాడు.

నేనే విక్రయిస్తున్నా..



వాణిజ్య పంటలకు పెట్టుబడులు ఎక్కువ. అందుకే కూరగాయల సాగుపై దృష్టి సారించా. కష్టపడితే మంచి దిగుబడులు, ఆదాయం వస్తాయి. కుటుంబసభ్యుల సహకారంతో పండించిన పంటలను నేనే సంతకు తీసుకువెళ్లి విక్రయిస్తా. ఒక్కోసారి మార్కెట్‌కు తీసుకెళ్తా.

– దోనిగామ శ్రీనివాస్, కుంటాల

ఘనంగా తిరంగా ర్యాలీ



ఖానాపూర్‌లో ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు



భైంసారూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని వీధుల్లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జగన్నాథ్‌రావు చౌరస్తాలో విద్యార్థులతో కలిసి జాతీయగీతం ఆలపించారు. కార్యక్రమంలో గడ్డం రవీందర్, రవీందర్‌రెడ్డి, సత్యవతి, లింబాద్రి, గోపాల్‌రెడ్డి, అనిల్‌రావు, చిన్నారెడ్డి, గిరి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని టాక్లి గ్రామంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి, నాయకులు సాయినాథ్, పరమేశ్వర్, మహేందర్, రాజేశ్వర్, సుధాకర్, సుభాశ్, అఖిల్, నాగన్న, గంగాప్రసాద్, సంతోష్ తదితరులు ఉన్నారు.



కుంటాల: జాతీయ జెండాలతో నాయకులు

కుంటాల: హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా మండలంలోని కల్లూరు గ్రామంలో బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రజినీకాంత్, బూత్ అధ్యక్షుడు బబ్లు శ్రీను, నాయకులు సాయిరాం, సట్వాజీ దత్తు, గడ్డం నవీన్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి దిగంబర్ పటేల్, మనోహర్, సందీప్, రాందాస్, శంకర్ పాల్గొన్నారు.

అఖండ భారత దినోత్సవం



ఖానాపూర్‌లో కాగడాలతో ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఖానాపూర్: అఖండ భారత్ సంకల్ప దివస్ పురస్కరించుకొని పట్టణంలో భజరంగ్‌దల్ ఆధ్వర్యంలో ఖగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చౌరస్తా నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయ్, రాజశేఖర్, భూమేశ్, అల్లాడి వెంకటేశ్వర్లు, పడాల రాజశేఖర్, నాయిని సంతోశ్, ప్రతాప్ తదితరులున్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని జీబు అడ్డాలో హిందూ వాహిని ఆధ్వర్యంలో అఖండ భారత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్గనిస్థాన్, శ్రీలంక, భూటాన్ దేశాలు భారత్‌లోనే అంతర్భాగమని.. కొందరి స్వార్థం కారణంగా వాటిని విభజించారని పేర్కొన్నారు. హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు అంతా మన దేశమేనని తిరిగి అఖండ భారత్ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పడిపెల్లి గంగాధర్, దత్తాత్రి, హిందూ ధర్మజాగరణ ప్రముఖ్ అభిశేఖర్, నందు, పంటి, దత్తాత్రి తదితరులు ఉన్నారు.

ధ్వంసం చేసినవారిని శిక్షించాలి

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో మహలింగి రోడ్డుపై ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి శిక్షించాలని గ్రామస్తులు, రజకసంఘం సభ్యులు గురువారం భోసి ఎక్స్‌రోడ్డు వద్ద భైంసా– నాందేడ్ ధర్నాకు దిగారు. బుధవారం రాత్రి చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేశారని తెలిసి రజకసంఘం సభ్యులు, గ్రామస్తులు ఉదయం తరలివచ్చి విగ్రహం పరిశీలించారు. అనంతరం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. తహసీల్దార్ మహేందర్‌నాథ్, ఎస్సై షేక్ జుబేర్ అక్కడి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. విచారణ చేసి దుండగులను శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ బృందాలను రప్పించి విగ్రహం పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. పలు వివరాలు నమోదు చేసుకున్నారు. ఎస్సై జుబేర్ మాట్లాడుతూ ఘటన కారకులైన వారిని పట్టుకొని శిక్షిస్తామని పేర్కొన్నా రు.



ఆందోళనకారులకు నచ్చజెప్పుతున్న పోలీసులు, అధికారులు

నిందితులను అరెస్టు చేయాలి

ముధోల్: తానూరు మండలం భోసి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకొని శిక్షించాలని తెలంగాణ రజాక రిజర్వేషన్ సమితి రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రసిడెంట్ రావుల గంగాధర్ అన్నారు. గురువారం ఆయన ముధోల్‌లో విలేకరులతో మాట్లాడారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

తానూరు: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆగస్టు 15న బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ రాజశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వీధికుక్కలు, పశువులను నియంత్రించాలి

ఖానాపూర్: పట్టణంలో ప్రధాన కూడళ్లు, బస్టాండ్ ప్రాంతంలో వీధికుక్కలు, పశువుల సంచారం ఎక్కువైందని.. వీటిని రోడ్లపైకి రాకుండా నియంత్రించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ వకీల్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ సుందర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. వీధికుక్కల బెడదతో చిన్నారులు, విద్యార్థులు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారని వాపోయారు. పశువుల పెంపకందారులకు నోటీసులు జారీ చేసి రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణవాసులు తదితరులు ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

‘వీధికుక్కల బెడద నివారించాలి’

ముధోల్: మండలకేంద్రంలో వీధికుక్కల బెడదను నివారించాలని గురువారం ఎంపీడీవో శివకుమార్, గ్రామపంచాయతీ ఈవో అన్వర్‌అలీకి కసాబ్‌గల్లీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల్లో తిరుగుతున్న వీధికుక్కల గుంపును చూసి గ్రామస్తులు, చిన్నారులు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు వృద్ధులు, చిన్నారులు వీధికుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రి పాలయ్యారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అబ్దుల్ రౌఫ్, అబ్దుల్ షకీల్, మీర్‌ఆదిల్‌అలీ, అబ్దుల్ అర్షద్, అబ్దుల్ సలీం, కాలనీవాసులు తదితరులున్నారు.

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలి

లోకేశ్వరం: వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.800 చెల్లించాలన్నారు. కూ లీలకు ఏడాదికి రూ.12 వేలు, మహిళలకు రూ. 2500, నెలకు రూ.4వేలు పింఛన్, ప్రమాద బీమా కింద రూ.10 లక్షలు వంటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఉపాధి పని ప్రదేశంలో ఫొటోలను అప్‌లోడ్ చేసే విధానం వెనక్కి తీసుకోవాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, శ్రీనివాస్, మండలాధ్యక్షుడు తిమ్మాపూరం ముత్తన్న, ప్రసాద్ కృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డాకూర్ తిరుపతి

ఎమ్మెల్యే బొజ్జును కలిసిన బాధితులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో డబుల్ బెడ్‌రూం కాలనీలో అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్లను కేటాయించాలని కోరుతూ అర్హులైన బాధితులు గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిశారు. ఉట్నూర్‌లోని ఎ మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సు నారికారి రాజేశ్, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పీటర్, బహుజన కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. మధ్యలో నిలిపివేసిన సర్వేను అధికారులు పూర్తి చేసి అనర్హులను తొలగించాలని కోరారు.

నేడు జౌలా(బి)లో వర్షావాస్

తానూరు: మండలంలోని జౌలా(బి) గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో వర్షావాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సభ జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు వాగ్మారే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి నిజామాబాద్ బుద్ధవిహార్ పూజ్యబంతె బుద్ధఘోష్ హాజరై బుద్ధుడి చరిత్రపై ప్రవచనాలు చెబుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన భారతీయ బౌద్ధమహాసభ నాయకులు రావాలని కోరారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి గతంలో పరీక్ష రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 14, ఏడో తరగతిలో 19, తొమ్మిదో తరగతిలో 6, పదో తరగతిలో 6, ఇంటర్ ఫస్టియర్‌లో 40, ఇంటర్ సెకండియర్‌లో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని.. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు గోపాలుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈనెల 16న కృష్ణాష్టమి సెలవు కావడంతో ఉట్టి కొట్టే వేడుక నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సోన్ కద్రాల్ ప్రాథమిక పాఠశాలలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



లోకేశ్వరం: గడ్‌చాంద ప్రాథమిక పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



మామడ : పరిమండల్ గ్రామ ఎంపీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు



లక్ష్మణచాంద: పొట్టపెల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు, ఉపాధ్యాయులు



ఖానాపూర్‌లోని ఓ పాఠశాలలో..



సారంగపూర్ పాఠశాలలో..



కుంటాలలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



బాసర: కిర్గుల్(బి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, టీచర్లు



లోకేశ్వరంలోని ఓ పాఠశాలలో..

బాబా ఆలయంలో భక్తుల సందడి

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. సాయి బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.